క్లుప్తంగా

మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్‌ను అందజేస్తున్న దాత శ్రీనివాసు

ఆలమూరు: స్థానిక అయ్యప్ప స్వాముల పీఠానికి మైక్‌సెట్ బహూకరించారు. గ్రామానికి చెందిన పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి, రాష్ట్ర వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ఈదల శ్రీనివాసు సుమారు రూ.15 వేల వ్యయంతో కొనుగోలు చేసిన మైక్‌సెట్‌ను గురుస్వామి గంగుల రామ్‌కుమార్ పీఠానికి సోమవారం అందజేశారు. పూజ, భజన కార్యక్రమాల కోసం అత్యంత ఉపయోగకరంగా ఉండే మైక్‌సెట్‌ను బహుకరించిన దాత శ్రీనివాసుకు స్వాముల బృందం కృతజ్ఞతలు తెలిపింది.

స్వామివారి సన్నిధిలో టీటీడీ పాలక మండలి మెంబర్



శేషుబాబుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం టీటీడీ పాలక మండలి మెంబర్ మేకా శేషుబాబు దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

ఘనంగా బ్రూస్‌లీ జయంతి

ఆలమూరు: కలవచర్లలోని మదర్ థెరీసా స్పోర్ట్స్ అకాడమీలో సోమవారం మార్షల్ ఆర్ట్స్ సృష్టి కర్త బ్రూస్‌లీ జయంతిని నిర్వహించారు. జిల్లా మార్షల్ అర్ట్స్ అధ్యక్షుడు టి.అబ్బులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు బ్రూస్‌లీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టి బ్రూస్‌లీపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. నేటి యువత అంతా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుని శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందించుకోవాలని పలువురు వక్తలు సూచించారు. అమెరికాలో జన్మించి హంకాంగ్‌లో పెరిగి కుంగ్‌ఫూ కరాటే విద్యలో ప్రావీణ్యం సంపాదించి ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించిన బ్రూస్‌లీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కుంగ్‌ఫూ మాస్టర్లు లంకే వెంకటరెడ్డి, ఎస్.సెంథిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడాకారుడికి సత్కారం



అభిషేక్‌ను సత్కరిస్తున్న యూత్ సభ్యులు

సఖినేటిపల్లి: స్థానిక మూడుతూములు సెంటర్‌కు చెందిన బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడాకారుడు కనపాల అభిషేక్‌ను స్థానిక అంబేడ్కర్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సత్కారించారు. భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఈ మేరకు ఇటీవల స్వగ్రామానికి వచ్చిన అభిషేక్‌ను వారు సన్మానించారు. విదేశాల్లో బ్యాడ్మింటన్ ఆడి, గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించి, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ విభాగంలో 15వ ర్యాంకు చేరి, దేశానికి గర్వకారణంగా అభిషేక్ నిలిచాడని వక్తలు ప్రశంసించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, పి.నరసింహమూర్తి, బళ్ల నోబుల్ ప్రభాకర్, తాడి సహదేవ్, జాన్ విలియమ్స్, యూత్ అధ్యక్షుడు బి.ప్రేమ్, సభ్యులు టి.బాపి కుమార్, పి.శ్రీకర్, కె.శ్రీకిరణ్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో గాయపడి కాలు విరిగిపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.12 వేలు నగదు, కిరాణా సరుకులు అందజేశారు. వేదిరేశ్వరం గ్రామానికి చెందిన నేకూరి సూర్యారావు పోలియోతో ఒక కాలు పని చేయకపోయినా రావులపాలెంలో టైలరింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈయనకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టైలరింగ్ చేస్తుండగా పక్కకి పడిపోవడంతో ఒక కాలు విరిగిపోయింది. దీంతో ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేశారు. కుటుంబాన్ని పోషించే సూర్యారావు మంచాన పడిపోవడంతో కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. దీన్ని తెలుసుకున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ ఆర్థిక సాయం అందజేశారు.



పలివెల కొప్పేశ్వరస్వామిని అభిషేకిస్తున్న అర్చకులు



పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



మాచవరం శివాలయంలో అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

హర హర శంభో..

- శైవక్షేత్రాల్లో కార్తీక సోమవారం పూజలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



అంతర్వేదిలో ధ్వజస్తంభం వద్ద దీపాలతో స్వామివారి నామాలు తీర్చిదిద్దుతున్న మహిళలు

సఖినేటిపల్లి: హరిహరులకు ప్రీతికరమైన కార్తిక మాసంలోని రెండో సోమవారానికి పౌర్ణమి ఘడియలు కలిసి రావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జామున నుంచి శైవ, వైష్ణవ ఆలయాలు రద్దీగా మారాయి. ఆలయాల్లో భక్తులు దీపాలను వెలిగించారు. శివాలయాల్లో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, బిల్వ పత్రాలతో పూజలు చేశారు. అంతర్వేది లక్ష్మీనృసింహుని, అంతర్వేది నీలకంఠేశ్వరస్వామి, మోరి సీతారామలింగేశ్వర స్వామి, గుడిమూల కృత్యకృత్య రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో వేకువ జామున నుంచి భక్తులు పూజలు చేశారు. శివాలయాల్లో భక్తులు నందీశ్వరుని వద్ద, జమ్మి చెట్టు వద్ద, ధ్వజస్తంభాలు వద్ద దీపాలను వెలిగించారు.

పి.గన్నవరం: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక గరుడేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మొండెపులంక, ఆర్.ఏనుగుపల్లి, ముంగండ, బెల్లంపూడి తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

అంబాజీపేట: మండలంలోని శైవక్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాచవరంలో కందుల మల్లేశ్వరస్వామి ఆలయం, వ్యాఘ్రేశ్వరంలో వ్యాఘ్రేశ్వర స్వామి ఆలయం, గంగలకుర్రు అగ్రహారం ఉమాపార్వతి సమేత వీరేశ్వరస్వామి ఆలయం, శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. కె.పెదపూడి, గంగలకుర్రు, నందంపూడి, ఇరుసుమండ తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.

ఘనంగా దీపోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో కార్తిక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు నేతృత్వంలో ఈ దీపాలంకరణ చేశారు. ఆలయంలో స్వామివారి తిరునామం ఆకారంలో దీపాలను ఏర్పాటు చేసి వెలుగించారు. మహిళలు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. మండలంలో ప్రసిద్ధి చెందిన పెనికేరులో యిష్టకాంతేశ్వరస్వామి ఆలయం, ఆలమూరులో విక్రమ భట్టేశ్వరస్వామి ఆలయం, నర్సిపూడి, మడికి గ్రామాల్లోని బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయాలు, మూలస్థానం అగ్రహారంలోని మూలేశ్వరస్వామి, చొప్పెల్లలో మల్లేశ్వరస్వామి, చింతలూరులో పృథ్వీశ్వరస్వామి ఆలయాలతో పాటు వివిధ శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. మహిళలు ధ్వజస్తంభాలు, రావి, తులసి చెట్ల వద్ద దీపాలు వెలిగించారు. శివాల్లో నిర్వహించిన జ్వాలతోరణం భక్తులను అలరించింది.



మోరి శివాలయంలో వేకువ జామున ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తపేట: మండల పరిధిలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యే పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధానంగా కొత్తపేట మండలం పలివెల గ్రామంలో పురాణ ప్రసిద్ధి చెందిన ఉమా కొప్పేశ్వర స్వామివారి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. తెల్లవారు జాము నుంచే పూజలు, స్వామివారికి అభిషేకాలు చేశారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ భమిడిపాటి దుర్గాలో ఈ నారాయణ ఆధ్వర్యంలో ఈఓ ప్రసాదరాజు, సిబ్బంది భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లు చేశారు. మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. దేవదాయ-ధర్మదాయ శాఖ ఏసీ, దేవస్థానం ఈఓ కె.వి జయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొత్తపేట హరిహర దేవాలయం, వాడపాలెం, వానపల్లి, బిళ్లకుర్రు, మోడేకుర్రు, అవిడి, కండ్రిగ, గంటి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



చొప్పెల్లలో మల్లేశ్వరస్వామి



పి.గన్నవరంలో గరుడేశ్వరుని అభిషేకిస్తున్న అర్చకుడు

రావులపాలెం: మండలంలో ఊబలంక సర్వమంగళ సమేత ఉమామహేశ్వర స్వామి, రావులపాలెం పార్వతీ రామలింగేశ్వరస్వామి, కొమరాజులంక ముమ్మిడివర్రుపాడు, వెదిరేశ్వరం, గోపాలపురం, ఈతకోట, రావులపాడు తదితర గ్రామాల్లో శివాలయాలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అయినవిల్లి: మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ముక్తేశ్వరంలో ముక్తేశ్వరస్వామి ఆలయం, అయినవిల్లి విశ్వేశ్వరాలయం, నేదునూరు చెన్నమల్లేశ్వరుని ఆలయాల్లో పూజలు జరిగాయి.

త్వరితగతిన ప్రభుత్వ భవనాలను పూర్తి చేయాలి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు మండల ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు సూచనలు, సలహాలను అందజేశారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

ఆలమూరు: చొప్పెల్ల గ్రామ సచివాలయం-1 పరిధిలోని మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

బూత్ కమిటీలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయండి

సఖినేటిపల్లి: మండలంలో బీజేపీ బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు అయ్యేలా చూడాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు అన్నారు. సోమవారం అంతర్వేదికరలో పార్టీ మండల సమావేశం అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. వచ్చే నెల అమలాపురంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరీ, జిల్లాలో ఉన్న ఆయా కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కిసాన్ మోర్చా డ్రైయనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, కో కన్వీనర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు ఈశ్వర్‌గౌడ్, నాయకులు పి.సురేష్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకు పథకాలు



అంతర్వేదికరలో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన పేదలందరికీ ఇంటికే సంక్షేమ పథకాల లబ్ధి సమకూరుతోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం అంతర్వేదికరలో ఎమ్మెల్యే రాపాక, తనయుడు రాపాక వెంకట్‌రామ్‌తో కలిసి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలకు జారీ చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, పార్టీ వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షుడు కొల్లాబత్తుల ధర్మారావు, నాయకులు గెద్దం అమ్ములు, దొంగ నాగ సత్యనారాయణ, దూది త్రినాథ్, బెల్లంకొండ ఏసుబాబు, చెల్లుబోయిన గోపాలకృష్ణ, కొల్లాబత్తుల చిట్టిబాబు, యెనుముల నారాయణ స్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతిపత్రం

సఖినేటిపల్లి: తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు నియోజకవర్గ స్థాయి సమగ్ర శిక్షా ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అంతర్వేదికరలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిసి విజ్ఞప్తి చేశారు. తమను రెగ్యులరైజ్ చేసే హామీని అమలు చేయాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర జేఏసీ ఉద్యోగ సంఘ నాయకులు కృష్ణ, వై.శ్రీను, స్థానికులు రవి, సత్యనారాయణ, పుష్పలత, మంగతాయారు, ధనలక్ష్మి, రాజబాబు, వినయ్, మాధురి, ప్రశాంత్, సంధ్య పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

కొత్తపేట: కిడ్నీల సమస్యతో బాధపడుతున్న యువకుడి వైద్యానికి మండల శెట్టిబలిజ యువజన సంఘం రూ.20 వేలు సాయం అందించారు. బిళ్లకుర్రు గ్రామానికి చెందిన మట్టపర్తి వెంకటేష్ కొన్ని రోజులుగా కిడ్నీల సమస్యతో బాధపడుతున్నాడు. అతని రెండు కిడ్నీలు పాడైపోయాయి. అయితే అతని తల్లి కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చారు. దీనికి సుమారు రూ.10లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. పేదరికంలో ఉన్న వెంకటేష్ కుటుంబం ఉన్న సొమ్ములన్నీ వైద్యానికి ఖర్చు చేయడంతో ఇప్పుడు నిస్సహాయంతో ఉంది. సోషల్ మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్న యువ శెట్టిబలిజ సంఘం సభ్యులు తమ వంతుగా రూ.20వేలు సాయం సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, కార్యదర్శి శీలం కొండబాబు, ఖండ్రిగ ఉప సర్పంచ్ కడలి పార్థసారథి, జాయింట్ సెక్రటరీ కడలి భీమా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముషిణి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బిళ్లకుర్రులో కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం చేస్తున్న శెట్టిబలిజ యువజన సంఘం సభ్యులు

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రదర్శన

మలికిపురం: గొల్లపాలెంలో సోమవారం స్థానిక గ్రామైక్య సంఘం ఆధ్వర్యాన జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మహిళలు ప్రదర్శన నిర్వహించారు. వచ్చే నెల 22 వరకూ ఏపీ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో లింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా ప్రచారాలు నిర్వహించి, సంఘ సభ్యులకు అవగాహన కల్పిస్తామని గ్రామైఖ్య సంఘ వీవోఏ మట్టా మంగాదేవి తెలిపారు. గ్రామైఖ్య సంఘ సభ్యులు, డ్వాక్రా సంఘ సభ్యులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఆలమూరు: సమాజంలో తరచూ జరుగుతున్న లింగ ఆధారిత హింస నిర్మూలనకు అందరూ సహకరించాలని వైఎస్సాక్ వెలుగు మండల కోఆర్డినేటర్ ఎం.ధనరాజు అన్నారు. లింగ ఆధారిత హింస నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలమూరులో భారీ ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, వేధింపులపై చైతన్యం తీసుకురావాలంటూ నినాదాలు చేశారు. సీఓ ఎం.నవీన్‌కుమార్, సీసీలు సీహెచ్ సుబ్బారావు, కె.బీమరాజు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మకుమారి సంస్థ వార్షికోత్సవం

రావులపాలెం: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రావులపాలెం శాఖ 33 వసంతాల వార్షికోత్సవాన్ని స్థానిక ఎంకేఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 150 పౌర్ణమి యోగ తపస్యాభట్టి పూర్తి చేసుకున్న సందర్భం వివిధ ప్రాంతాల నుంచి ఆ సంస్థ ప్రముఖులు హాజరై విశ్వశాంతి యాత్ర ర్యాలీ నిర్వహించారు. స్థానిక బ్రహ్మకుమారి ఆశ్రయం నుంచి ఎంకేఆర్ ఫంక్షన్ వరకూ బ్రహ్మకుమారీలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ నుంచి బ్రహ్మకుమారిస్ శాఖల ఇన్‌చార్జి బ్రహ్మకుమారి రజని, విజయనగరం నుంచి బ్రహ్మకుమారి అన్నపూర్ణ, మౌంట్ అబూ నుండి బ్రహ్మకుమార్ కృష్ణమూర్తి, దిల్ రెడ్డి హాజరై ఆధ్యాత్మిక ప్రసంసాగాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక బ్రహ్మకుమారి రజని ఆధ్వర్యంలో రాజయోగ అభ్యాసంలో ఉన్న 50 మందిని ఘనంగా సన్మానించారు. అలాగే ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించి సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



రావులపాలెంలో ర్యాలీ చేస్తున్న బ్రహ్మకుమారి సంస్థల సభ్యులు

30 నుంచి శతచండీ సహిత రుద్రయాగం

అంబాజీపేట: మాచవరంలో ఉన్న పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 11వ తేదీ వరకు శతచండీ సహిత రుద్రయాగాన్ని నిర్వహిస్తున్నట్టు యాగ నిర్వాహకులు సుసర్ల బుజ్జి తెలిపారు. భక్తుల సహకారంతో ఈ నెల 29 సాయంత్రం అంకురార్పణ, దీక్షధారణ, వాస్తు మండపం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 30న గోపూజ, పంచగ వ్యప్రాశన, ప్రధాన మండపారాధన, రుద్రాభిషేకం, చండీసప్తశతి పారాయణ, గణపతి జపం తదితర పూజలు జరుగుతాయని తెలిపారు. ఈ పూజలు డిసెంబర్ 11 వరకూ కొనసాగుతాయని, మహాపూర్ణాహుతితో పూజలు ముగిస్తాయని తెలిపారు. అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన విద్యార్థులు

పి.గన్నవరం: విజ్ఞాన యాత్రలో భాగంగా పోతవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం పి.గన్నవరంలో పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పోలీస్ స్టేషన్, మండల పరిషత్, గ్రంథాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్, ఎంఈఓ, మండల రెవెన్యూ కార్యాలయాలను హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో విద్యార్థులు సందర్శించారు. వాటి పనితీరును హెచ్‌ఎం వివరించారు. అనంతరం ఎల్.గన్నవరంలో డొక్కా సీతమ్మ వారి నివాసాన్ని, ఆమె వినియోగించిన వస్తువులను విద్యార్థులు తిలకించారు.

'చలో అమలాపురం' విజయవంతం చేయాలి



మామిడికుదురు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మామిడికుదురు: అమలాపురంలోని కొంకాపల్లి శ్రీసత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో డిసెంబరు 11వ తేదీన జరిగే మాదిగ, మాదిగ ఉప కులాల రాజకీయ ఆత్మీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. మామిడికుదురు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం జరిగిన రాజోలు నియోజకవర్గ మాదిగ, మాదిగ ఉప కులాల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. సమావేశంలో చేట్ల సత్యనారాయణ, మందగాంధీ, శెట్టిం రమేష్, ముసూడి భాస్కరరావు, శెట్టిం శ్రీను, తెన్నేటి నగేష్, కండెల్ల బుజ్జి, పెదపూడి మణికంఫ, కండెల్ల విజయ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

ఆత్రేయపురం: మండలంలోని వసంతవాడ, పులిదిండి గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన సదస్సు జరిగింది. ఆయా గ్రామ సచివాలయల పరిధిలో సర్పంచ్‌లు కనుమూరి సూరయ సుందర సీతా కుమారి, గాధిరాజు రామకృష్ణం రాజు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులను ఎంపీడీఓ నాతి బుజ్జి, ఈఓపీఆర్‌డీ డి.శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 17 రకాల సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, కనుమూరి శ్రీనివాసరాజు, మండల వైస్ ఎంపీపీ పెన్మెత్స బంగార్రాజు, బీజేపీ రాష్ట్ర ఉద్యక్షులు మానేపల్లి అయ్యాజీ వేమా పాల్గొన్నారు.

రైతులకు లంక భూములపై ప్రత్యేక హక్కు



- ఎమ్మెల్యే చిట్టిబాబు

పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: జగనన్న ప్రభుత్వం 'సి' క్లాసు లంక భూములకు ఐదేళ్ల కాల పరిమితితో పట్టాలు ఇచ్చి, లంక రైతులకు ప్రత్యేకమైన హక్కులు కల్పించిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఊడిమూడి గ్రామంలో 253.38 ఎకరాల లంక భూమిని 627 మంది రైతులకు ఐదేళ్ల లీజు కాల పరిమితితో పట్టాలను సోమవారం అందజేశారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ ఈ పట్టాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సర్పంచులు నూకపెయ్యి ప్రసన్నకుమార్, తోలేటి బంగారునాయుడు, డీటీ బి.గోపాలకృష్ణ, పార్టీ నాయకులు సాధనాల రమేష్, అడ్డాల రవి, కొల్లు రాంబాబు, కడలి వెర్రియ్య, నేలపూడి గంగరాజు, ఐ.గణపతి, ఎ.వెర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రక్షిత మంచినీరు

పి.గన్నవరం: నరేంద్రపురం శివారు పెదపాలెంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.39.7 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మించనున్నారు. దీనికి సోమవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బీర వెంగమాంబ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. అనంతరం ప్రాథమిక పాఠశాలకు మంజూరైన వంట పాత్రలను చిట్టిబాబు అందజేశారు. సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మి ప్రసాద్, పార్టీ నాయకులు నేలపూడి సత్యనారాయణ, రాయుడు చిన్న, దంగేటి విశ్వనాథం, కొంబత్తుల చంద్రశేఖర్, దొమ్మేటి దుర్గారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జె.కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో నారుమడిని తయారు చేసుకోవాలి

అంబాజీపేట: సస్యరక్షణ చర్యలతోనే నాణ్యమైన నారుమడిని తయారు చేసుకోవాలని ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త అనూష అన్నారు. నాబార్డు సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలపై లెవిల్ హుడ్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్ఈడీపీ) శిక్షణ పూర్తి చేసుకున్న ఈదరాడ, పాశర్లపూడి, జనుపల్లి గ్రామాల మహిళలు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ కొబ్బరి మొక్కలను శాస్త్రీయ పద్ధతిలో నాటడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కొబ్బరిచెట్లు తెగుళ్లు, వ్యాధుల బారిన పడకుండా యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు, పురుగులు, తెగుళ్ల, యాజమాన్య పద్ధతులు, బదనికలను వివరించారు. విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం వై.సోము నాయుడు, ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, మూడు గ్రామాల మహిళలు పాల్గొన్నారు.



అంబాజీపేటలోని కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలను వివరిస్తున్న శాస్త్రవేత్త అనూష

శనైశ్చరుని ఆలయంలో అపచారం

- పెట్రోల్ బాటిల్‌తో తైలం తెచ్చి అభిషేకం
- వాసన పసిగట్టి అభిషేకాలు నిలిపివేసిన అర్చకులు
- సంప్రోక్షణ అనంతరం పునఃప్రారంభం
- తైలం క్రయ, విక్రయదారుల గుర్తింపులో అధికారులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర(శనైశ్చర)స్వామివారికి సోమవారం అపచారం జరిగింది. ఒక భక్తుడు తైలాభిషేకం సందర్భంగా పెట్రోల్ వాసన రావడంతో గర్భాలయంలో ఉన్న అర్చకుడు గుర్తించారు. పెట్రోల్ బాటిల్‌లో తైలం (నువ్వుల నూనె) తీసుకువచ్చి అభిషేకించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి సంబంధించి అర్చకులు, అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కార్తిక సోమవారం సందర్భంగా స్థానిక భక్తులతో పాటు బయట నుంచి కూడా భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు, తైలాభిషేకం జరిపించారు. స్థానికులతో పాటు స్థానికేతరుడైన ఒక భక్తుడు తైలాభిషేకం జరిపినప్పుడు శివలింగంపై గుప్పుమని పెట్రోల్ వాసన రావడాన్ని గర్భాలయంలో ఉన్న అర్చకుడు గుర్తించారు. బయట నుంచి వచ్చిన ఆ భక్తుడు తైలం పోసినప్పుడే పెట్రోల్ వాసన వచ్చినట్టు అర్చకుడు గుర్తించి నిలదీయగా నాకేమీ తెలియదని, పెద్ద వంతెన సమీపంలో దేవస్థానం ఆర్చిగేటు వద్ద ఒక విక్రయదారుని వద్ద నూనె కొనుగోలు చేశానని చెప్పి జారుకున్నాడు. స్వామివారికి అపచారం జరిగిందని స్థానిక భక్తుల ద్వారా విషయం బయటకొచ్చింది. దానితో అభిషేకాలు నిలిపివేసి, జరిగిన విషయాన్ని దేవదాయ శాఖ ఏసీ, దేవస్థానం ఈఓ కే విజయలక్ష్మికి తెలిపారు. ఆమె ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామ్మూర్తి, ఆలయ పండితులతో సమీక్షించారు. అనంతరం ప్రధాన అర్చకుడు శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు శివలింగానికి సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు జరిపి అనంతరం పూజలు పునఃప్రారంభించారు. దీనిపై ఏసీ అండ్ ఈఓ విజయలక్ష్మిని సాక్షి వివరణ కోరగా బయట నుంచి వచ్చిన భక్తుడు నూనె పోశాడని అయితే పెట్రోల్ బాటిల్‌లో పోసి తీసుకువచ్చాడన్నారు. అ భక్తుడు ఎవరు? అతను చెప్పిన ప్రకారం ఆర్చిగేటు వద్ద ఆ భక్తునికి నూనె విక్రయించింది ఎవరు? అనే దానిపై విచారిస్తున్నట్టు తెలిపారు.



మందపల్లిలో శనైశ్చర లింగానికి సంప్రోక్షణ చేస్తున్న ప్రధాన అర్చకుడు శ్రీరామ్మూర్తి